




దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 272 గురువారం 26-9-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


## ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేని సీఎం

**సర్పంచ్‌లకు న్యాయం చేస్తామని..అన్యాయం**

**మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ విమర్శలు**



**హైదరాబాద్,సెప్టెంబర్25:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఒక్క మాటా నిలబెట్టుకోలేదని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విమర్శించారు. ఆయన టిపిసిసి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సర్పంచ్‌లకు న్యాయం చేస్తానని చెప్పి ఇప్పుడు సిఎం అయ్యాక వారికి అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బుధవారం జరిగాయి. ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించిన ఈటల రాజేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచులు, గ్రామ పంచాయతీలను కేసీఆర్ ప్రభుత్వం విస్మరిస్తుందని రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మాట్లాడారని, బిల్లులు రాక 60 మంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని అప్పుడు రేవంత్ అన్నారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేవంత్ అనాడు మాట్లాడిన ఒక్క మాట కూడా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.సర్పంచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు ఆయనని పలకరించిన నాథుడే లేదని వాపోయారు. అడ్డదారులు తొక్కి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. దసరాలోపు పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ చేయాలని ఈటల డిమాండ్ చేశారు. లేకుంటే మిమ్మల్ని ఎక్కడికి అక్కడ అడ్డుకునేందుకు సర్పంచ్‌లు సిద్దంగా ఉన్నారని హెచ్చరించారు. సర్పంచ్‌ల ఆందోళనకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, సర్పంచ్ ల పదవి కాలం పూర్తయ్యి ఏడు నెలలు దాటినా ఎన్నికలు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.

# దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు..

- లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు
- కేంద్రం ఇచ్చే ఆవాస్ యోజన ఇళ్లు పొందాలి
- రాజీవ్‌స్వగృహ ఇళ్లను వెంటనే వేలం వేయండి
- గృహనిర్మాణంపై సిఎం రేవంత్ రెడ్డి సమీక్ష



**తొలి సమయం హైదరాబాద్,** దసరా నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహ ఇళ్లను వేలం వేయాలని సూచించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించాలని సూచించారు. గృహనిర్మాణశాఖపై సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు.దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. గ్రామ/ వార్డు, మండల/ పట్టణ, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటుకు విధివిధినాలు ఒకట్రెండు రోజుల్లో రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన నుంచి ఇతర రాష్ట్రాలు లక్షల సంఖ్యలో గృహాలు మంజూరు చేయించుకుంటే ఈ విషయంలో తెలంగాణ వెనుకబడి ఉందని, ఈ దఫా కేంద్రం మంజూరు చేసే గృహాల్లో గరిష్ట సంఖ్యలో రాష్ట్రానికి ఇళ్లు సాధించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పీఎంఏవై కింద రావల్సిన బకాయిలు రాబట్టాలని సీఎం సూచించారు. కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సమాచారం వెంటనే ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో డాటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సీఎం అన్నారు. పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తే ఇంజినీరింగ్ సిబ్బంది సమస్య ఎదురయ్యే పరిస్థితి ఉంటుందని అధికారులు తెలపగా... అవసరమైతే ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నియామకాలు చేపట్టాలని ముఖ్యమంత్రి అన్నారు. రాజీవ్ స్వగృహలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లు, ఇళ్లు వేలం వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఏళ్ల తరబడి వృథాగా ఉంచడం సరికాదని, వెంటనే వేలానికి రంగం సిద్ధం చేయాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా వాటిని ఎందుకు అప్పగించలేదని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అర్హులకు ఆ ఇళ్లను అప్పగించాలన్నారు. హైదరాబాద్ నగరంలో నిర్మించి నిరుపయోగంగా ఉన్న బ్లాక్‌లకు మౌలిక వసతులు కల్పించి, వాటికి అర్హులైన లబ్ధిదారులకు అప్పగించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఎండీ వి.పి.గౌతమ్, ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఢిల్లీ సిఎం అతిశీకి జడ్ కేటగిరి భద్రత

**కేంద్రహోంశాఖ ఆదేశాల మేరకు నిర్ణయం**




**న్యూఢిల్లీ,సెప్టెంబర్25:** ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆతిశీకి ఢిల్లీ పోలీసులు జెడ్ కేటగిరీ భద్రత కల్పించారు. ఆమె కాన్వాయ్‌లో పైలట్‌తో సహా పోలీసు సిబ్బందితో భద్రత కల్పించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ప్రోటోకాల్ ప్రకారం.. కేంద్రహోంశాఖ ఆదేశాల మేరకు ఢిల్లీ సీఎం జెడ్ కేటగిరీ సెక్యూరిటీ వర్తిస్తుంది. దీంతో ఆతిశీకి రక్షణగా ఢిల్లీ పోలీసులు 22 మందిని షిఫ్టుల వారీగా మోహరించారు. జెడ్ కేటగిరీ భద్రతలో పీఎస్‌వోలు, ఎస్కార్ట్స్, సాయుధ గార్డులు ఉంటారు. అయితే, ఎప్పటికప్పుడు ముప్పును అంచనా వేసి కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆదేశాల మేరకు కేంద్ర సంస్థలు ఆమె భద్రతను సమీక్షించే అవకాశం ఉంటుందని అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలావుంటే ఢిల్లీలో అసంఘటిత రంగంలోని కార్మికుల కనీస వేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 1 నుంచి కొత్త రేట్లు అమలులోకి వస్తాయని సీఎం ఆతిశీ వెల్లడించారు. తాజా నిర్ణయంతో నైపుణ్యం లేని కార్మికులకు కనీస వేతనం రూ.18,066, మధ్యస్తంగా నైపుణ్యం కలిగిన వారికి రూ.19,929, నైపుణ్యం కలిగినవారికి రూ.21,917కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. సామాన్య ప్రజలకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించేందుకు అవసరమైన ప్రతి చర్యనూ ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు.

# కాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాల్సిందే

**- లేకుంటే పార్లమెంట్ వేదికగా యుద్ధం తప్పదు**

**- లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ**



**జమ్మూ,సెప్టెంబర్25:** ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత జమ్మూ కశ్మీరుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించని పక్షంలో పార్లమెంట్‌లో ఇండియా కూటమి తన పూర్తి బలాన్ని ప్రదర్శించడమేగాక ఆందోళన చేపడతుందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. బుధవారం నాడిక్కడ పార్టీ అభ్యర్థుల తరఫున ఒక న్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగిస్తూ 2019లో ఇదివరకటి రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సమయంలో జమ్మూ కశ్మీరు ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. జమ్మూ కశ్మీరుకు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలన్న తన డిమాండును ఆయన పునరుద్ఘాటిస్తూ రాష్ట్ర హోదాను లాగేసుకుని ఒక రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చడం భారతదేశ చరిత్రలో ఎన్నడూ సంభవించలేదని అన్నారు.అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్ర హోదాను కేంద్ర ప్రభుత్వం పునరుద్ధరించని పక్షంలో పార్లమెంట్ ఉభయ సభలలో తమ ఇండియా కూటమి పూర్తి బలాన్ని ఉపయోగిస్తుందని, అవసరమైతే రోడ్లపైకి వస్తామని ఆయన హామీ ఇచ్చారు. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా బయటి వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకే జమ్మూ కశ్మీరు నుంచి రాష్ట్ర హోదాను లాగివేశారని ఆయన ఆరోపించారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఉన్నంత వరకు బయటి వ్యక్తులు లబ్ధి పొందుతారని, స్థానికులను పక్కనపెడతారని రాహుల్ వ్యాఖ్యానించారు. జమ్మూ కశ్మీరును స్థానికులకు బదులుగా బయటి వ్యక్తులు నడిపించాలన్నది కేంద్రంలోని బిజెపి ఆలోచనగా ఆయన అభివర్ణించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ మీ హక్కు.. మీ భవిష్యతు..అది లేకుండా జమ్మూ కశ్మీరు అభివృద్ధి సాధించలేదు అని రాహుల్ తెలిపారు. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో చిన్న, మధ్యతరహా వ్యాపారాలపై ఒక క్రమపద్ధతిలో దాడి జరుగుతోందని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసం పనిచేస్తోందని, వారికి మార్గాన్ని సుగమం చేసేందుకు జిఎస్‌టి, పెద్ద నోట్ల రద్దును ఆయుధాలుగా కేంద్రం ఉపయోగించిందని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని మేక్ ఇన్ అదానీ కార్యక్రమంగా ఆయన అభివర్ణించారు. ఈ విధానం కింద అన్ని కాంట్రాక్టులను అదానీ కంపెనీకి కట్టబెడుతున్నారని రాహుల్ ఆరోపించారు. జమ్మూ కశీరుకు కేంద్ర స్థానమైన జమ్మూ వెన్నెముకను బిజెపి ప్రభుత్వం, లెఫ్టినెంట్ గవర్నర్ విరగ్గొడుతున్నారని ఆయన ఆరోపించారు.

# మూసీ సుందరీకరణ పేరుతో కుంభకోణం

**రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టే అవసరం ఉందా**

**శుద్ది ప్లాంట్లను నిర్లక్ష్యం చేయడంలో ఆంతర్యం**

**ఫతేనగర్ మురుగుశుద్ది ప్లాంట్‌ను సందర్శించిన కెటిఆర్**



**తొలి సమయం హైదరాబాద్,** మూసీ సుందరీకరణ పేరుతో కుంభకోణం జరుగుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. దీని టెండర్లను పాకిస్థాన్ కంపెనీలకు కట్టబెడుతున్నారు. ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీరు మూసీ నదిలోకి వెళ్తోంది. 94 శాతం స్వచ్ఛమైన నీరు వెళ్తున్నప్పుడు మళ్లీ శుద్ధి ఎందుకని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుకు రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టే అవసరం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. తమ హయాంలో హైదరాబాద్‌ను మురికి నీటి రహిత నగరంగా మార్చాలనే గొప్ప లక్ష్యంతో మురుగు శుద్ధి కేంద్రంలను ప్రారంభించామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఫతేనగర్ మురుగు శుద్ధి కేంద్రంను ఆ పార్టీ నేతలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులతో కలిసి పరిశీలించారు. వీటి నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపిస్తోందని విమర్శించారు. అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. తమ హయాంలో మొత్తం 31 ఎస్టీపీల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రూ.3,866 కోట్లతో మురుగునీటి శుద్ధి కార్యక్రమం ప్రారంభించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మూసీ సుందరీకరణ అంటోందని ఎద్దేవా చేశారు. దీని కోసమే రూ.వేలు, లక్షల కోట్లు అంటే అందరికీ అనుమానం వస్తోందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క అనేక అబద్ధాలు చెప్పారని విమర్శించారు. ఎస్టీపీల పెండింగ్ పనులను ఈ ప్రభుత్వం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో పెద్దలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం జరుగుతోందని చెప్పారు. మరోవైపు కూకట్‌పల్లి ఎస్టీపీని కేటీఆర్, భారాస నేతలు పరిశీలించనున్నారు.

# లోతట్టు ప్రాంతాలపై దృష్టి పెట్టండి

**- వరదనీరు నిలువకుండా చర్యలు తీసుకోండి - వర్షాలపై అధికారులను అప్రమత్తం చేసిన కమిషనర్**

**తొలి సమయం హైదరాబాద్,** వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో వరద నిలువకుండా చర్యలు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల సమయంలో నీరు నిలిచే చోట శాశ్వత పరిష్కారం చూపాలని, ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేసి నివేదిక అందజేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ కమర్షియల్‌గా ఉండి, రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తున్న యజమానులకు నోటీసులు జారీచేసి ట్యాక్స్ రివిజన్ చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన వారికి పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాలని ఆదేశించారు. మరో సమీక్షలో నగరంలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. వైద్యారోగ్యశాఖ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని..యాంటీ లార్వల్, ఫాగింగ్ విస్తృతం చేయాలని పేర్కొన్నారు.వర్షాల నేపథ్యంలో కమిషనర్ ఆమ్రపాలి ఎల్బీనగర్ జోన్‌లోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. శానిటేషన్ నిర్వహణ, రోడ్లపై పాట్‌హోల్స్ తదితర వాటిని పరిశీలించారు. సరూర్‌నగర్ నుంచి ఎల్బీనగర్, నాగోల్ రోడ్ మీదుగా ఉప్పల్ భగాయత్, ఉప్పల్ స్టేడియం రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి రోడ్డు మరమ్మతులు, శానిటేషన్‌పై తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

# కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయండి

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య




**తొలి సమయం హన్మకొండ, సెప్టెంబర్ 25**
ప్రముఖ ప్రజాకవి, పద్మ విభూషణ్ పురస్కార గ్రహీత కాళోజీ నారాయణరావు పేరిట నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాళోజీ కళా క్షేత్రంలో నిర్మాణం పూర్తయిన వాటర్ ఫౌంటెన్, లాన్ , ఫోటో, ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, ఆడిటోరియానికి సంబంధించిన ప్రొజెక్టర్ స్క్రీన్, సౌండ్ సిస్టం, విద్యుద్దీపాలు, వేదిక, కళాకారుల మేకప్ రూమ్, ర్యాంప్ లైట్స్, తదితర పనులను కలెక్టర్ పరిశీలించి అధికారులకు, సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులకు ఏర్పాట్లకి సంబంధించిన పనులపై పలు సూచనలు చేశారు. ప్రారంభోత్సవ రోజున కార్యక్రమాల ఏర్పాట్లను గురించిన వివరాలను కూడా పిఓ అజిత్ రెడ్డి, హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్రం ప్రారంభోత్సవం రోజున కార్యక్రమాల ప్రారంభం నుంచి ముగింపు వరకు ఎక్కడా కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కుడా ఈఈ భీమ్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




# నైబర్‌హుడ్ ఛాలెంజ్ పోటీలో బల్దియాకు ఎక్సలెన్స్ సర్టిఫికేట్

**బెంగళూరు, ఇండోర్, జబల్ పూర్, కొచ్చి లతో పాటు జిడబ్ల్యూఎంసీ కు దక్కిన స్థానం**

**ఎక్సలెన్స్ సర్టిఫికేట్ దక్కడం పట్ల హర్షం వ్యక్తం చేసిన మేయర్**




**తొలి సమయం వరంగల్ సెప్టెంబర్ 25**
బల్దియా సిగలో మరో మణిహారం చేరింది. కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి గృహ మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్ యుఏ )ఆధ్వర్యం లో బుధవారం ఢిల్లీ లో స్మార్ట్ సిటీ నగరాలకు సంబందించి జరిగిన సమావేశంలో గత మూడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ (ఎన్ ఎన్ సి)పోటీల్లో ఇతర నగరాలతో పోటీపడి ఉత్తమ ప్రదర్శన కనబర్చిన తొలి(టాప్)-5 నగరాలకు కేంద్ర మంత్రిత్వ శాఖ సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ అందజేసినట్లు బల్దియా ఎస్ ఈ ప్రవీణ్ చంద్ర తెలిపారు.ఎన్ ఎన్ సి పోటీల్లో బెంగళూరు, ఇండోర్, జబల్పూర్, కొచ్చి నగరాలతో వరంగల్ మహా నగరం టాప్ -5 లో చోటు దక్కడం పట్ల నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేసి సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ రావడానికి కృషి చేసిన జిడబ్ల్యు ఎంసీ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు.ఈ సందర్భం గా మేయర్ మాట్లాడుతూ సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్ మన నగరానికి రావడం మనందరికీ గర్వకారణం అని దేశ వ్యాప్తం గా కేంద్ర ప్రభుత్వం గతం లో 100 స్మార్ట్ సిటీ నగరాలను ఎంపిక చేయడం జరిగిందని తిరిగి అందులో నుండి ఫేజ్ -1 లో భాగం గా నర్చరింగ్ నైబర్ హుడ్ ఛాలెంజ్ పేరు తో నిధులు అందజేసి నిర్ణీత సమయం లో పార్కు లను ఏర్పాటు చేయడానికి పోటీలు నిర్వహించిన నేపథ్యం లో నగర వ్యాప్తం గా ఎం హెచ్ నగర్ లో చిట్టి పార్క్ 56 గంటల రికార్డ్ స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందని, దీనితో పాటు క్రిస్టియన్ కాలనీలో నైబర్హుడ్ పార్క్, కరిమాబాద్ లో గుండు బావి, శ్రీనగర్ కాలనీలో సేన్సోరి పార్క్ ఎల్ పి స్కూల్ లో సైన్స్ పార్క్, అంబెడ్కర్ కూడలి వద్ద బుద్ధ ప్లాజా లను నిర్దేశిత సమయంలో ఏర్పాటు చేసి డాక్యుమెంటేషన్ ను ఎంపిక కమిటీ కి పంపించడం జరిగిందని వాటిని పరిశీలించిన కమిటీ దేశవ్యాప్తంగా 5 నగరాల్లో బల్దియా కు ఎక్సలెన్స్ సర్టిఫికేట్(అవార్డు) ఎంపిక చేసిందని ఫేజ్ -2 లో భాగం గా నగరం లో మరి కొన్ని పార్కులను అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందజేసే అవకాశం ఉన్నట్లు మేయర్ తెలిపారు. ఈ సందర్భం గా బుధవారం ఢిల్లీ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ మిషన్ డైరెక్టర్ రాహుల్ కపూర్ చేతుల మీదుగా ఎక్సలెన్స్ సర్టిఫికేట్(అవార్డు) స్వీకరించినట్లు ఎస్ ఈ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏ ఈ కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఆశీర్వదించండి

**- చట్టసభలో నిరుద్యోగుల సమస్య లపై పోరాడుతా - వాకర్స్ తో ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి**




**తొలి సమయం, కరీంనగర్ సెప్టెంబర్ 25**
గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల సాధనకు చట్టసభలో వారి పక్షాన పోరాటం చేస్తానని కరీంనగర్ ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్ సంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.. బుధవారం కరీంనగర్ శాతవాహనయూనివర్సిటీ ,కేడీఆర్( కటారి దేవేందర్ రావు పార్కు) లో వాకార్స్ ను కలసి రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు. అనంతరం ఎల్ఐసి ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగం రాక, జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయారని అన్నారు. ఉద్యోగాల ఖాళీల భర్తీకి, డీఏ, ఇంక్రిమెంట్ల సాధనకు, ప్రైవేట్ విద్యాసం స్థల్లో పనిచేసే వారికి ఆరోగ్యకార్డులు, ఫీజు రియంబర్స్మెంట్ సకాలంలో అందించేలా కృషి చేస్తానన్నారు. నూతన విద్యా పాలసీ తీసుకొస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనివల్ల ఇంటర్, పదో తరగతి బోర్డులు ఉంటాయా? లేదా? అనే సందే హాలు కలుగుతున్నాయని అన్నారు..దీనిపై ప్రభుత్వంతో చర్చించేందుకు, సమస్యల పరి ష్కారానికి తనను గెలిపించా లని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీగా గెలిచాక సేవకుడిగా ఉంటానని, తన వేతనాన్ని పేదల విద్యాభ్యాసం, నిరుద్యోగ సంక్షేమనిధి ఏర్పాటు చేసి కేటాయిస్తానని తెలిపారు. ప్రస్తుతం పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతోం దన్నారు. ఈ కార్యక్రమంలో పీవీఎన్ఆర్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ హనుమండ్ల రఘుపతిరెడ్డి, జనరల్ సెక్రటరి కొండ రవీందర్, వైస్ ప్రెసిడెంట్లు కర్ర సత్యనారాయణ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పాలోజు రవీందర్, గౌరవ సలహాదారులు పిట్టల నర్సయ్య, చక్రధరస్వామి, శ్యాంసుందర్ రెడ్డి,బుస్సా శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, అనిల్, విజయ్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘట్కేసర్ రైతు సేవా సహకార సంఘం 48వ సర్వసభ్య సమావేశం

**పాల్గొన్న ఎంపీ ఈటల, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్,**
**మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, చైర్ పర్సన్ ఉల్లిపావళి జంగయ్య యాదవ్**



**ఘట్కేసర్ సెప్టెంబర్ 25**
మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఘట్కేసర్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ 48వ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమం అధ్యక్షులు సింగిరెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి ,ఘట్కేసర్ మున్సిపాలిటీ ఛైర్మెన్ మల్లి పావని జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటూ రైతు పక్షపాతిగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ది ఘట్కేసర్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ ప్రస్తుత పాలకవర్గం అధ్యక్షులు సింగిరెడ్డి రామిరెడ్డి, తోపాటు ఉపాధ్యక్షులు బద్దం అనంతరెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, జిల్లాల పోచిరెడ్డి, బిరెడ్డి స్రవంతి, మహేందర్, చందుపట్ల ధర్మారెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, గ్యార వెంకటేష్, గోపు బాలరాజ్, వంగూరు లక్ష్మమ్మ, ఇటికాల రామకృష్ణారెడ్డి, కల్యాణ వర్మ, వెంకటరెడ్డి, చీప్ మేనేజర్ వివేక్, మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ రాజు తదితర పాలకవర్గంతో పాటు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# నిరుద్యోగ యువత గొంతుకనవుతా

**- ముల్కనూరులో బైక్ ర్యాలీతో స్వాగతం పలికిన యువత - ముల్కనూర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన నరేందర్ రెడ్డి**



**తొలి సమయం, భీమదేవరపల్లి సెప్టెంబర్ 25**

కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపిస్తే నిరుద్యోగ యువత గొంతుకనవుతానని ఆల్ఫోర్స్ విద్య సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొత్త కొండ వీరభద్ర స్వామిని దర్శించుకునేందుకు విచ్చేస్తున్న నరేందర్ రెడ్డిని పెద్ద ఎత్తున యువత బైక్ ర్యాలీతో స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు అన్నారు.ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక,జాబ్ క్యాలెండర్లు విడుదల కాక, ఒకవేళ నోటిఫి కేషన్లు వచ్చినా, ఎగ్జామ్స్ పెట్టినా, ఉద్యోగ నియా మకాలు పూర్తికాక నిరుద్యోగులు, ఏండ్లు గడు స్తున్నా డీఏ, ఇంక్రిమెంట్స్ తదితర బకాయిలు రాక, సమస్యలు తీరక ఉద్యోగులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే తాను నిరుద్యోగులు, ఉద్యోగుల తరపున గళం వినిపించేందుకు కరీంనగర్. నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించు కున్నట్టు తెలిపారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఒక్క రూపాయి జీతం తీసుకోకుండా స్వ చ్ఛందంగా సేవ చేస్తానన్నారు



# నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు

**28వ డివిజన్ లో క్షేత్రస్థాయి పరిశీలనలు**
**బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే**



**వరంగల్ /సెప్టెంబర్ 25**
అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే బిల్లుల చెల్లింపులు జరుపుతామని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు. బుధవారం బల్దియా పరిధిలోని 28వ డివిజన్ హంటర్ రోడ్డు ప్రాంతం 100 ఫీట్ల రోడ్ వద్ద నిర్మించిన సిసి రోడ్డు తో పాటు సాయి నగర్ ప్రాంతంలో నిర్మించిన డ్రైనేజీని కమిషనర్ కొలతలు వేసి పరిశీలించి నిర్మిత ప్రమాణాలు పాటించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ శ్రీనివాస్, డిఈలు రాజ్ కుమార్,రంగారావు,కృష్ణ మూర్తి,, ఏఈలు సతీష్, హరికుమార్,మోజామిల్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు



**తొలి సమయం, కరీంనగర్/సైదాపూర్/ సెప్టెంబర్ 25**
బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి పార్టీ సభ్యత్వ నమోదును చేశారు. మండల కన్వీనర్ కూనమళ్ళ మొండయ్య,కంది మల్లారెడ్డిలు ఎలబోతారం, రాములపల్లి,గుజ్జులపల్లి, గోడిశాల,బొమ్మకల్, అమ్మనగుర్తి,గుండ్లపల్లి, రాయికల్,గణపూర్,పెర్కపల్లి, దుద్దెనపల్లి గ్రామల్లో సందర్శించి బీజేపీ నాయకులను,బూత్ అధ్యక్షులను కలసి సభ్యత్వాలను వేగవంతం చేయాలనీ,అనులైన్లో చేసిన సభ్యత్వలను పార్టీ ఇచ్చినా ఫారం లో నింపి ప్రతి బూత్ కు 200 తగ్గకుండా సభ్యత్వాలు చేయాలనీ ప్రతి ఇంటికి వెళ్లాలని పలు సూచనలు చేశారు.ఇక్కడ బీజేపీ నాయకులు గుర్రాల మాధవరెడ్డి,ముత్యాల రమణారెడ్డి,పల్లెని ప్రవీణ్ రావు,జెల్ల మల్లేష్,అనుమండ్ల గోపాలరెడ్డి,మ్యాకల ముకుందరెడ్డి,చందుపట్ల సత్యం,మునిగంటి వేణు, గ్రామాల బూత్ అధ్యక్షులు సోషల్ మీడియా కన్వీనర్ నలువాలా మహేందర్ తదితరులు వున్నారు.

# బారి వర్షాలకు కూలిన ఇల్లు

**హవేలీఘనపూర్సెప్టెంబర్ 25**



వారం రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుడడంతో హవేలీఘనపూర్ మండలంలో బూరుగుపల్లి గ్రామానికి చెందిన మైసాల బుజ్జమ్మ భర్త కీ.శే సిద్ధయ్య ఇల్లు ఒక రూము పూర్తిగా కూలిపోయింది. ఈ నెల 9 వ తేదీన ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కి అర్జీపెట్టుకున్నానని మొన్నటి భారీ వర్షాలకు నా ఇల్లు పాక్షికంగా దెబ్బతిని గోడలు పై కప్పు పెచ్చులుడు తుంది. ఇలాగనే మళ్లీ వర్షాలు వస్తే మిగతా ఇల్లు కూడా కూలిపోయే ప్రమాదం ఉన్నది. దయచేసి పెద్ద మనసుతో జిల్లా కలెక్టర్ నన్ను ఆదుకోవాలని, ప్రభుత్వం నుండి సహాయం చేయాలని కోరారు.

## కొత్తకొండ వీరభద్ర స్వామిని దర్శించుకున్న ఆల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి

**భీమదేవరపల్లి /సెప్టెంబర్ 25**




బుధవారం నాడు హన్మకొండ జిల్లా కొత్తకొండ వీరభద్రస్వామిని ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి కోరమీసాలు, గుమ్మడికాయలు చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు అనంతరం ఈ ఓ కిషన్ రావు స్వామివారి చిత్రపటాన్నీ ఘనంగాసన్మానించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కొత్త కొండ వీరభద్ర స్వామి ఆశీర్వచనం అందరి మీద ఉండాలని వేడుకుంటున్నట్లు తెలిపారు.



# వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలి

**- విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన మంత్రి సీతక్క,కలెక్టర్**

**- గిరిజన సంక్షేమ, షెడ్యూల్ కులముల బాలికల వసతి గృహాల సందర్శన - హాస్టల్ల నిర్వహణ తీరుపై సంతృప్తి వెలిబుచ్చిన మంత్రి**







**తొలి సయయం ములుగు సెప్టెంబర్ 25**

వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క సూచించారు. బుదవారం ములుగు జిల్లా కేంద్రం లోని గడిగడ్డ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహం ను మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క విద్యార్థులతో మాట్లాడి వసతి, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. చదువు ఎలా సాగుతోందని విద్యార్థులను అడిగారు. మంచి విద్యను అభ్యసించాలని సూచించారు.భోజనం ఎలా వుంది, అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా విద్యార్థినులు బయటకు వెళ్తున్నారా అని వార్డెన్ ను అడిగారు. ఈ సందర్భంగా మంత్రి, కలెక్టర్ విద్యార్థినిలతో కలసి అల్పాహారం చేశారు. అతిథిగా వచ్చి తమతో పాటు కింద కూర్చుని మంత్రి, కలెక్టర్ భోజనం చేయడంతో ఆ విద్యార్థినుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఇస్తున్నారా? లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అల్పాహారం నాణ్యతను పరిశీలించెందుకు విద్యార్థులతో పాటు కింద కూర్చొని వారితో ముచ్చటిస్తూ భోజనం చేశారు.

ఉప్మా బాగుందని, రోజూ ఇలాగే మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. హాస్టల్లో ఉన్న ఖాళీ స్థలంలో షెడ్డును (డైనింగ్ హాల్) నిర్మిస్తే విద్యార్థినిలు అల్పాహారం, భోజనం చేసేందుకు అనువుగా ఉంటుందని దసరా సెలవుల్లో షెడ్ నిర్మించాలని మంత్రి తెలిపారు.అనంతరం మంత్రి ప్రక్కనున్న షెడ్యూల్ కులముల బాలికల వసతి గృహం ను సందర్శించారు. విద్యార్థులను పలుకరించి వారికి అందిస్తున్న భోజన, వసతి సదుపాయాలు, రోజువారీ దినచర్య గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలు భోజనం చేసేందుకు డైనింగ్ హాల్ లేదని నిర్వాహకులు మంత్రి కి తెలుపగా, ఖాళీ స్థలంలో దసరా సెలవుల్లో షెడ్ (డైనింగ్ హాల్) ను నిర్మించాలని మంత్రి తెలిపారు.ఇంకా ఏమైనా మౌలిక సదుపాయాలు అవసరం ఉన్నట్లయితే కలెక్టర్ దృష్టికి తీసుకుని రావాలని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ టి డి ఓ దేశిరాం, జిల్లా షెడ్యూల్ కులాల అధికారి బానోత్ లక్ష్మణ్, డివి హెచ్ ఓ కొమురయ్య, డి డబ్లు ఓ ఇంచార్జ్ శిరీష, డి పి ఓ దేవ్ రాజ్, ఎం.పి.డి. ఓ రామకృష్ణ, తహసిల్దార్ విజయ భాస్కర్, ఐ టి డి ఓ ఎస్ ఓ రాజ్ కుమార్, ఎంపి ఓ రహీం, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మినీ జాతర పనులు ప్రధాన జాతరకు పనికి వచ్చేలా చెయ్యాలి

- మినీ మేడారం జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయండి
- నూతన పనులను నాణ్యతతో చేయాలి
- మిగిలిన పెండింగ్ బిల్లును వెంటనే చెల్లిస్తాం
- రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ- శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క




**తొలి సయయం ములుగు సెప్టెంబర్ 25**

వచ్చే సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగే మినీ మేడారం జాతరను విజయవంతం చేయడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, మినీ జాతర పనులు మహా జాతరకు ఉపయోగపడేలా ఉండాలని రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పీ శబరీష్, డీఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి రానున్న మినీ మేడారం జాతరపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నప్పటికీ ఆయా పనులు శాశ్వతంగా ఉండకపోవడం వల్ల మరల అవే పనులు చేపట్ట వలసివస్తున్నదని ఇప్పటినుండి చేపట్టే పనులు దీర్ఘకాలంగా ఉండే విధంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం స్పర్స్ పథకాన్ని ప్రవేశపెట్టిన దృశ్య జాతరకు నిధులు వచ్చే అవకాశం ఉందని, జాతరకు విడుదలయ్యే నిధులతో గద్దెల చుట్టూ ఫ్లోరింగ్ చేయడంతో పాటు నిత్యం మంచినీటిని సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతర సమయంలో కోట్లాదిమంది భక్తులు రావడమే కాకుండా సెలవు దినాల్లో సైతం వేలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుండి మేడారం చేరుకుంటున్నారని, వారికి సైతం వసతులు కల్పించాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగం పై ఉందని అన్నారు. గతంలో జాతరలో పనిచేసిన అధికారుల సూచనలు సలహాలను జిల్లాలో బాధ్యతలు చేపట్టిన కొత్త అధికారులు తీసుకోవాలని, తాను మంత్రి అయినప్పటికీ స్థానిక ఎమ్మెల్యేగా జాతర అదనపు నిధులు తేవడానికి కృషి చేస్తానని అన్నారు.

భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసిన పక్షంలో ములుగు జిల్లాలో జిల్లా అధికారులను భక్తులు ఎన్నటికీ మర్చిపోలేరని, ములుగు జిల్లాకు డైనమిక్ కలెక్టర్ రావడం జిల్లా ప్రజల అదృష్టమని హర్షం వ్యక్తం చేశారు. 2024 లో జరిగిన మహా జాతర సందర్భంగా చేపట్టిన పనులకు నిలిచిపోయిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించడానికి చర్యలు తీసుకుంటానని, మేడారంలో చేపట్టే పనులు శాశ్వతంగా ఉండే విధంగా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సిహెచ్. మహేందర్ జి, సంపత్ రావు ( ఇన్చార్జి ), ఎండోమెంట్ ఈ ఓ రాజేందర్, డి ఎం అండ్ హెచ్ ఓ అప్పయ్య,పీఆర్, ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్, ఇరిగేషన్, ఆర్ డబ్లు , విద్యుత్ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.






# వయో వృద్ధులకు సంబంధించిన పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**




**తొలి సయయం హన్మకొండ సెప్టెంబర్ 25**

తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ,సంక్షేమ చట్టం- 2007 ప్రకారం పెండింగ్ లో ఉన్న కేసులను ఆర్డీవోలు త్వరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో బుధవారం (25/09/2024) నుండి అక్టోబర్ 1 తేదీన నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నేపథ్యంలో అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవానికి సంబంధించి వారం రోజుల కార్యక్రమాల కార్యాచరణ వివరాల గోడ ప్రతులను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ వారం రోజులపాటు నిర్వహించే అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వయోవృద్ధులకు సంబంధించిన పలు కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. తల్లిదండ్రులు, వయోవృద్ధులకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చట్టంపై అవగాహన కల్పించడానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రజలలో అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. వారం రోజులపాటు నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఒకరోజు హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుండి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీని నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలలో మొదటి రోజున సంబంధిత శాఖల అధికారులు, వయవృద్ధులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గురువారం (26/09/2024)రోజున వృద్ధాశ్రమాలలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, శుక్రవారం(27/09/2024) వయోవృద్ధుల హక్కులపై అవగాహన కల్పించడానికి ర్యాలీ, (28/09/2024) శనివారం జిల్లా స్థాయిలో అవగాహన సదస్సు, సంక్షేమం, ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తారన్నారు, ఆదివారం(29/09/2024) నాడు గ్రామపంచాయతీ కార్యదర్శులు వయోవృద్ధుల హక్కుల పైన వయోవృద్ధుల సంబంధించిన చట్టాలపై కరపత్రాల ద్వారా అంగన్వాడి టీచర్ల ద్వారా పంపిణీ చేస్తారనిచెప్పారు. సోమవారం(30/09/2024) రోజున అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో గ్రాండ్ పేరెంట్స్ డే ను అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించాలని అన్నారు. అక్టోబర్ 1వ తేదీన అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం రోజున జిల్లాస్థాయి లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.




## ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేరుతో ఫేక్ మెసేజ్ లు

**మోసపూరితమైన మెసేజ్ లను నమ్మొద్దు**

**రెస్పాండ్ కావద్దు. వెంటనే మెసేజ్ బ్లాక్ చేయండి**

**కలెక్టర్ దివాకర టి. ఎస్.**




**ములుగు,సెప్టెంబర్ 25**

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పేరుతో సైబర్ నేరగాళ్లు ఫేస్బుక్లో నకిలీ ఖాతా సృష్టించారు. ఈ ఖాతాను ఉపయోగించుకుని పలువురి నుంచి డబ్బు వసూలు చేసేందుకు సైబర్ నేరగాళ్లు యత్నిస్తున్నారు. కలెక్టర్ దివాకర టి. ఎస్. మీటింగ్ లో ఉన్నానని, అర్జెంట్ డబ్బులు కావాలంటూ o998886747021 ఉజ్బెకిస్తాన్ నంబర్ నుంచి ఆ సందేశం పంపిన సబైర్ నేరగాడు డబ్బులు ఫోన్పే చేసి, స్క్రీన్షాట్ షేర్ చేయాలని కోరాడు. పలువురికి మేసేజ్లు పంపించారు.దీన్ని గమనించిన కలెక్టర్ దివాకర టి.ఎస్. తక్షణమే పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన అసలు ఫేస్బుక్ అకౌంట్ ద్వారా అందరిని అప్రమత్తం చేశారు. తన పేరుతో ఎవరూ డబ్బులు అడిగిన ఇవ్వొద్దని కలెక్టర్ సూచించారు. పై నంబర్ మోసపూరితమైనది. దయచేసి జవాబు ఇవ్వకండి. వీలైనంత త్వరగా బ్లాక్ చేయమని కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రతి ఒక్కరినీ కోరారు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు సైబర్ కేటుగాళ్ల ఆటకట్టించేందుకు సిద్ధమయ్యారు.

## సమ్మక్క - సారక్క సెంట్రల్ వర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్

**పారిక తుకరాం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్**

**ములుగు సెప్టెంబర్ 25**

ములుగు జిల్లాలోని సమ్మక్క – సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ (ఎస్ ఎస్ సి టి యూ) బీఏ ఆనర్స్ ప్రోగ్రాం లో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించబడుచున్నవని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పారిక తుకరాం బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్ స్పెషలైజేషన్, ఏకనామిక్స్ స్పెషలైజేషన్ వర్సిటీ నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు ఇవ్వబడునని, ఆసక్తిగలవారు నోటికేషన్ లో తెలిపిన గూగుల్ ఫారమ్ నింపి సబ్మిట్ చేయవలసి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ వర్సిటీకి యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ (యూ ఓ హెచ్) మెంటార్ వర్సిటీగా వ్యవహరిస్తోంది. యూఓ హెచ్ వెబ్సైట్లో వివరాలు చూడవచ్చు.

**అర్హత:**

పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి.

ఎస్సి, ఎస్టీ అభ్యర్థులు పాసైతే చాలు.

సీయూ ఈ టీ యూజీ 2024 అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రధమ ప్రాధాన్యం ఉంటుంది. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ మెరిట్ ఆధారంగా అవకాశం కల్పించ బడును.

**ముఖ్య సమాచారం.**

అభ్యర్థులు రిపోర్ట్ చేయాల్సిన తేదీ: అక్టోబరు, 3 న ఉదయం 9.00 గంటలకు. అభ్యర్థులు తీసుకురావాల్సిన పత్రాలు: 10 వ తరగతి, పన్నెండో తరగతి సర్టిఫికెట్లు, టీసీ, అభ్యర్థి ఫోటో, దరఖాస్తు కాపి. వేదిక :: యూత్ ట్రెయినింగ్ సెంటర్, వైటీసీ బిల్డింగ్, జాకరం గ్రామం, ములుగు జిల్లా. వెబ్ సైట్: http://acad.uohyd.ac.in సమాచారం కొరకు సంప్రదించగలరు. డా. వంశీ కృష్ణ రెడ్డి ఓ ఎస్ డి ఎస్ ఎస్ సి టి యు కాంటాక్ట్ నెంబర్ 82804 68530 ను సంప్రదించవచ్చని తెలిపారు.

## ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధికి 1.53 కోట్లు విడుదల చేసిన కూడా



**తొలి సయయం ఎల్కతుర్తి సెప్టెంబర్ 25**

ఎల్కతుర్తి జంక్షన్ అభివృద్ధి పరిపాలన అనుమతుల పత్రాన్ని సెక్రటేరియట్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ కి అందించిన కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి ఎల్కతుర్తి జంక్షన్ వయ వరంగల్, సిద్దిపేట రహదారి కరీంనగర్ ని అనుసంధానం చేయడంలో ప్రధానమై నదని, రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ దృష్టికి తీసుకురావడం జరిగింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఎల్కాతుర్తి జంక్షన్ ని నాలుగులైన్ రహదారిగా మార్చడంకోసం పనులు ప్రారంభించారు. మంత్రి పేర్కొన్న ఎల్కతుర్తి జంక్షన్ డెవలప్మెంట్, బ్యూటిఫికేషన్ కోసం, హన్మకొండ జిల్లా కలెక్టర్ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ సదరు రహదారిని సందర్శించినా కొన్ని రోజులనే మంత్రి ఎగ్జిక్యూటివ్స్ ఇంజనీర్ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ని పూర్తి నివేదిక సమర్పించమని ఆదేశించడం జరిగింది. ప్రాథమిక అంచనాల ఆధారంగా, కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ సమర్పించిన రూ 1.53 కోట్లు ఎల్కతుర్తి ట్రాఫిక్ జంక్షన్ అభివృద్ధి కోసం విడుదల చేసారు.

## పౌర సేవలో ఆత్మకూరు, చిల్పూర్ పోలీస్ బెస్ట్

**తొలి సయయం హన్మకొండ,సెప్టెంబర్ 25**

పౌర సేవలో ఉత్తమమైన సేవలు అందించినందుకు గాను ఆత్మకూరు,చిల్పూర్ పోలీసులు రాష్ట్ర పోలీస్ డిజిపి జితేందర్ చేతుల మీదుగా బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డును అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అందిస్తున్న సేవలతో పాటు విధి నిర్వహణలో చూపిస్తున్న ప్రతిభ ఆధారంగా ప్రతినెల రాష్ట్రంలో ఎంపిక ఎంపిక చేసిన పోలీస్ స్టేషన్ కు ఉత్తమ సేవలు అందజేయడం జరుగుతుంది. గత జూలై ఆగస్టు మాసాలకు సంబంధించి ఉత్తమ పౌర సేవలు అందించినందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ పరిధిలోని ఆత్మకూర్ పోలీస్ స్టేషన్ కు బెస్ట్ సిటిజన్ సర్వీస్ అవార్డుకు ఎంపిక చేస్తూ రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ సంతోష్, చిల్పూర్ ఎస్. ఐ రాజేందర్ లకు జ్ఞాపికను అందజేశారు ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆత్మకూరు,చిల్పూర్ పోలీసులను అభినందించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101